ఘనంగా పర్యావరణ దినోత్సవం


ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఆర్మూర్‌లోని హౌసింగ్‌బోర్డు చౌరస్తా వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు


బోధన్ పట్టణంలో..


బస్సాపూర్ గ్రామంలో..

పెర్కిట్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బోధన్/రెంజల్(బోధన్)/బోధన్‌టౌన్/భీమ్‌గల్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లో స్థానిక అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై ఎంపీడీవో సాయిరాం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. పెర్కిట్ కాంతి హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఆర్మూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు కళాశాల నుంచి మామిడిపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. చౌరస్తా వద్ద మానవహారం చేపట్టి పర్యావరణంపై అవగాహన కల్పించారు. రుద్రూర్ మండలంలోని రాయకూర్ శివారులో ఎంపీడీవో సురేష్ బాబు, ఈజీఎస్ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. అనంతరం సామూహిక పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. భీమ్‌గల్ మండలంలోని సికింద్రపూర్ గ్రామంలోని అమృత సరోవర్ సైట్‌ను ఎంపీవో నర్సయ్య, ఎంపీడీవో సంతోష్‌కుమార్ సందర్శించారు. ఈసందర్భంగా మొక్కలు నాటారు. బోధన్‌లోని రాకాసీపేట్ ప్రాంతంలో బోధన్ సీడీపీవో జానకీ పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పట్టణంలో సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పండ్ల మొక్క లు పంపిణీ చేశారు. ఆర్డీవో కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్క రూ కృషిచేయాలన్నారు.పర్యావరణానికి ముప్పు గా ఉన్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటాలని అన్నారు.


రాయకూర్ గ్రామంలో..


సికింద్రాపూర్‌లో..


సాటాపూర్ గ్రామంలో..


బోధన్‌లో మొక్కలు పంపిణీ

ప్రమాదకరంగా వంతెన



సిరికొండ: మండలంలోని తూంపల్లి నుంచి పాకాలకు వెళ్లే మార్గంలో దట్టమైన అటవీ ప్రాంతంలో వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగి వంతెనపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో వంతెన సైడ్ వాల్ ధ్వంసమై వాగులో పడిపోయిం, రోడ్డు కోతకు గురైంది. ఈ మార్గంలో పాకాల గ్రామంతో పాటు పుణ్యక్షేత్రమైన ఎదురు కొండ వెంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆలయానికి మండలం నుంచే కాకుండా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శనానికి వస్తుంటారు. ఆర్టీసీ బస్సు కూడా రాకపోకలు సాగిస్తుంటుంది. పాకాల మీదుగా పందిమడుగు, చీమన్‌పల్లి గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ప్రమాదకరంగా మారిన వంతెన వద్ద ప్రయాణికులు బిక్కుబిక్కుమంటు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు కోతకు గురై ఏడాది కావస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాలు కురవకముందే మరమ్మతులు చేపడితే సరే, లేదంటే వర్షాకాలంలో వరదలకు మొరం కొట్టుకుపోయి రోడ్డు పూర్తిగా తెగిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు త్వరగా మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

అందుబాటులో జనుము విత్తనాలు



రుద్రూర్: కోటగిరి ఉమ్మడి మండలానికి జనుము విత్తనాలు వచ్చినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస్ రావ్ బుధవారం తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ విత్తనాలు సబ్సిడీ పోను 40 కిలోల బ్యాగు రూ.1448లకు లభిస్తుందన్నారు. కావాల్సిన రైతులు ఆన్‌లైన్ పర్మిట్ ద్వారా కోటగిరి సింగిల్ విండో నుంచి పొందగలరని కోరారు. జనుము విత్తనాల కోసం పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ ప్రతులతో సంప్రదించాలని తెలిపారు.

పీఎంపీ క్లినిక్‌ల తనిఖీ



రుద్రూర్: కోటగిరి మండలంలోని కొత్తపల్లి, ఎత్తోండ గ్రామాల్లో పీఎంపీ క్లినిక్‌లను బుధవారం ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ తనిఖీ చేశారు. స్థానికులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది వివరాలు సేకరించారు. చికిత్స నిర్వహిస్తున్న పీఎంపీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటోను వారి వద్ద నుంచి తీసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీఎంపీల వివరాలు సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ఆరోగ్య సిబ్బంది ప్రమీల, సరోజ, లలిత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



బాల్కొండ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విత్తన దుకాణాలను బుధవారం ఆయన ఏఎస్సై శంకర్‌తో కలిసి తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు బిల్ రసీదు అందించాలన్నారు. రైతులు ఆ బిల్లును, బస్తాలను పంట చేతికి అందే వరకు జాగ్రత్తాగా భద్రపరుచుకోవాలన్నారు. డీలర్లు సంబంధిత స్టాకు రిజిష్టర్లు, బిల్‌బుక్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఏఈవోలు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై కాంగ్రెస్‌ను ఓడించాయి



వేల్పూర్: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని ఓడించారని వేల్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు రాజేందర్, రాజేశ్వర్, నరేందర్, నర్సయ్య, రమణ, చరణ్ బుధవారం వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో జీవన్‌రెడ్డికి ప్రజల ఆదరణను చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై బీజేపీ అభ్యర్థికి గంపగుత్తగా ఓట్లు వేయించారని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కోసం శ్రమించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మ ఆదర్శ బడుల తనిఖీ



మాక్లూర్: మండలంలోని గంగరమంద, వేణు కిషాన్‌నగర్‌తండా అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పనులను బుధవారం ఎంపీడీవో క్రాంతి తనిఖీ చేశారు. జూన్ 12న అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతున్నందున పనులను వేగంగా జరిపించాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. పనుల్లో జాప్యం చేస్తే సహించేది ఉండదన్నారు. ఇప్పటికే ఆలస్యం అయిందని ఇంకా ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పనులను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో బీజేపీకే ఆధిక్యం

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ బీజేపీకి అధికంగా ఓట్లు రావడంతో ఆధిక్యం ప్రదర్శించింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఈ నియోజకవర్గంలో 11,731 ఓట్ల మెజార్టీ లభించగా.. ఈ ఎన్నికల్లో మాత్రం మెజార్టీ గణనీయంగా పెరిగింది. నియోజకవర్గంలో ఎనిమిది మండలాల్లో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించగా కాంగ్రెస్ రెండో స్థానంలో, బీఆర్ఎస్ మూడో స్థానంకు పరిమితం కావడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మాత్రం ప్రభావం చూపని బీజేపీ.. పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి మునుపెన్నడూ లేనివిధంగా ఊపందుకోవడం విశేషం. బీజేపీకి క్యాడర్ తక్కువే ఉన్నా ప్రజల్లో అభిమానం పెరగడం, ప్రధానిగా నరేంద్ర మోదీని మరోసారి చూడాలని ఓటర్లు బలంగా విశ్వసించడంతోనే ఆ పార్టీకి భారీ ఓట్లు పోలయ్యాయనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మకు 30,250 ఓట్లు లభించాయి. కానీ కేవలం ఆరు నెలల వ్యవధిలోనే బీజేపీకి 84,915 ఓట్లకు పెరగడం గమనించదగ్గ అంశం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ప్రశాంత్‌రెడ్డి మూడోసారి గెలిచినా ఆయన ప్రభావం ఎంత మాత్రం పని చేయలేదు. ఫలితంగా బీఆర్ఎస్ కేవలం 19,722 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎమ్మెల్యే ఎన్నికల్లో రెండో స్థానంలో నిలచిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లోను ఆదే స్థానంకు పరిమితమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో సునీల్‌రెడ్డికి 65,884 ఓట్లు లభిస్తే, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 53,673 ఓట్లు దక్కాయి. బీజేపీ అభ్యర్థికి ఏకపక్షంగా ఓట్లు రావడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఖంగుతినక తప్పని పరిస్థితి ఏర్పడిందని చెప్పవచ్చు.

మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు

మండలం	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్
బాల్కొండ	10,140	6,123	1,398
ముప్కాల్	6,127	4,966	1,076
మెండోరా	7,305	5,738	1,589
మోర్తాడ్	10,515	6,500	2,351
ఏర్గట్ల	5,319	3,981	1,153
కమ్మర్‌పల్లి	12,037	8,377	3,586
భీమ్‌గల్	19,055	10,681	4,690
వేల్పూర్	14,417	7,813	3,879
మొత్తం	84,915	54,179	19,722

సమయానికి రాని బస్సులు

- ఇబ్బందుల్లో ఆర్మూర్ ప్రజలు
- పట్టించుకోని అధికారులు


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్


బస్టాండ్‌లో బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

ఆర్మూరటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికులు తమ గమ్యాలకు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ ఆవరణ ప్రతిరోజు ప్రయాణికులతో రద్దీగా మారుతుంది. కానీ బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే పెరిగిన రద్దీకి అనుగుణంగా సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సులు చాలా తక్కువగా ఉండడంతో వచ్చిన బస్‌లలో ప్రయాణికులు నిండిపోవడంతోపాటు ఫుట్‌పాత్ ప్రయాణం చేయాల్సి వస్తోంది. అధిక లోడు తో బస్సులు నడుపుతుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్‌లోని ప్రయివేట్ వాహనాలు..

బస్సులు సమయానికి రాకపోవడం, వచ్చిన బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రయివేట్ వాహనదారులు దర్జాగా బస్టాండ్‌లోకి వచ్చి నేరుగా ప్రయాణికులను తీసుకువేళుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే వివిధ గ్రామాలకు బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రజలు ఆటోను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ డిపో అధికారులు రద్దీకి అనుగుణంగా బస్సులు నడపకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సిద్ధులగుట్ట సమీపంలో ఓ ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యాలో ఎక్కడంతో బస్సులో నుంచి పొగలు వచ్చాయి. సిబ్బంది, ప్రయాణికులు వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపాలని, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బస్టాండ్ ఆవరణలో తిరుగుతున్న ఆటోలు

ఆటోలో వెళుతున్నాం..

బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయివేట్ వాహనాల్లో, ఆటోల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులు ఫ్రీగా ఉన్నప్పటికి సమయానికి రాకపోవడం, వచ్చిన బస్సులు సరికపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– నర్సమ్మ, మంథని గ్రామం

బస్సుల సంఖ్య పెంచాలి..

ఆర్మూర్ పట్టణంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను ఆర్టీసీ అధికారులు పెంచాలి. బస్సులు సమయానికి రాకపోవడంతో గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు వెంటనే అదనపు బస్సులు వేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి.

– అనిత, ఆర్మూర్

ఆధ్యాత్మికం..

■ చౌడేశ్వరిదేవి కల్యాణోత్సవాలు ప్రారంభం



రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో బుధవారం అమ్మవారిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దేవాంగ సంఘం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం శోభాయాత్ర నిర్వహించిన అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల కోసం అన్నదాన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

■ ఘనంగా అయ్యప్ప మాస పూజోత్సవం

బాల్కొండ: మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప మాసపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుబ్రమణ్యేశ్వర స్వామీ, గణపతి స్వాములకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప 18మెట్ల పూజలను నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రాంగాణంలో అన్నదానం నిర్వహించారు. గణేష్ జోషి పంతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన జిల్లాలోని దేవాంగ విద్యార్థులకు ఈ నెల 9న జిల్లా దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల 9లోగా వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ పురస్కారాలను అందజేయడానికి ముఖ్య అతిథులుగా రిటైర్డు ఐఏఎస్ చిరంజీవులు, సీటీవో రాజేశ్వర్, భువనగిరి అడిషనల్ కలెక్టర్ కొంగి గంగాధర్ హాజరవుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9391111093ను సంప్రదించాలని సూచించారు.

బీజేపీ లీగల్ సెల్ సంబురాలు



ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కోర్టు ఎదుట బుధవారం బీజేపీ లీగల్ సెల్ న్యాయవాదులు సంబురాలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి విజయం సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. న్యాయవాదులు జగన్ మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

సుభాష్‌నగర్: విద్యార్థి దశలోనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లోగల ఉమా మహేశ్వర కల్యాణమండపంలో బుధవారం వాసవి జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై, పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగులను విరాళంగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే భవిష్యత్ ఉంటుందని, చదువుకు పేదరికం అడ్డుకాదని తెలిపారు. ఆర్యవైశ్య నాందేవ్ వాడ సంఘం అధ్యక్షుడు లాభిశెట్టి శ్రీనివాస్ గుప్తా, రిటైర్డ్ గెజిటెడ్ ఉపాధ్యాయుడు సింధూర మాణిక్యం గుప్తా, గూడెపు సాయిప్రసాద్, మాటూరి లక్ష్మణ్, బచ్చు సాయి కృష్ణ, నంగునూరి నితిన్ కుమార్, కాపర్తి భరత్, ఆర్యవైశ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – లవ్‌మీ (తెలుగు) - 12.05, 6.15
ఫ్యూరియోసా (తెలుగు) - 3.00
హిట్‌లిస్ట్ (తెలుగు) - 9.10

స్క్రీన్-2 – గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) - 10.00, 1.05, 4.10, 7.15, 10.20

స్క్రీన్-3 – గంగం గణేశా (తెలుగు) - 12.15, 3.20, 6.25, 9.30

స్క్రీన్-4 – భజే వాయువేగం - 10.35, 1.30, 4.25, 7.20, 10.15

సంక్షిప్తం

ఎల్‌వోసీ అందజేత



మాక్లూర్: మండలంలోని అమ్రాద్ గ్రామానికి చెందిన బిచేగోదం అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. దీంతో బాధితుడిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు బుధవారం రూ.2,50,000ల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



బోధన్‌టౌన్(బోధన్): ఇటీవల వెలువడిన నీట్ పరీక్షా ఫలితాల్లో బోధన్‌లోని విజయ సాయి జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ ఫైజాన్ అహ్మద్ 632 మార్కులు సాధించారు. ఈసందర్భంగా సదరు విద్యార్థిని బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అభినందించారు.ప్రిన్సిపాల్ సుబ్బారావ్ ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో స్థానిక మమత నర్సింగ్ హోం 44వ వార్షికోత్సవం సందర్భంగా ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు.బుధవారం వైద్యుడు ఉమామహేశ్వర్ రెడ్డి టోర్నీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయుటకు టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాల్లో గెలుపు ఓటములు సహజ మన్నారు. ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, కబడ్డీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీంగల్ విద్యార్థినికి నీట్‌లో అర్హత

నిజామాబాద్‌అర్బన్: భీమ్‌గల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థి హీనసాహెర్ నీట్ ఎంట్రెన్స్‌లో 676 ర్యాంక్ సాధించింది. విద్యార్థినికి ప్రభుత్వ వైద్య కళాశాల నందు సీట్ లభించడం చాలా ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ అబ్బ చిరంజీవి బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా విద్యార్థినిని అభినందించారు.